
# సవారమ్మ చల్లని చూపుండాలి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- గ్రామదేవత సవారమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు
- 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లింపు
- ఘనంగా స్వాగతం పలికిన నాయకులు



గ్రామదేవత ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బీకేఎంఆర్ దంపతులు



దాసరిపల్లిలో ఎమ్మెల్యే బీకేఎంఆర్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మల్దకల్, డిసెంబర్ 5 : ప్రజలందరిపై గ్రామ దేవత సవారమ్మ అమ్మ వారి చల్లని చూపు ఉండాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. గద్వాల నియోజకవర్గం ఎమ్మెల్యేగా రెండోసారి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి విజయం సాధించడంతో మంగళవారం మండలంలోని దాసరిపల్లిలో వెలిసిన గ్రామ దేవత సవారమ్మ అవ్వని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆయన సతీమణి బండ్ల జ్యోతి దర్శించుకున్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఎమ్మెల్యే బీకేఎంఆర్ దంపతులు తొలి సారి గ్రామానికి వస్తున్నందున ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పెద్ద వీరన్న, సర్పంచ్ భరత్ రెడ్డి భాజాభజంత్రీలు, పటాకులు కాల్చుతూ ఘనంగా గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం సవారమ్మ అవ్వ ఆలయంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ సత్యారెడ్డి, రమేశ్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, విక్రం సింహారెడ్డి, తిమ్మప్ప, రాముడు, చంద్రశేఖర్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే విజయుడు, చిత్రంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

## అలంపూర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన కేసీఆర్

- కేసీఆర్, కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా

అలంపూర్, డిసెంబర్ 5 : ఎటువంటి రాజకీయ అనుభవం లేకున్నప్పటికీ పార్టీ, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిపై ఉన్న ప్రేమ, అభిమానం, నమ్మకంతో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించినందుకు అలంపూర్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని కేసీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయుడు కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ నియోజకవర్గ ప్రజలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని కేసీఆర్ భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేతోపాటు నియోజకవర్గ సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

# ఆర్‌ఎన్‌ఆర్@రూ.3,251

- మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం



బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన ధాన్యం

జడ్చర్ల, డిసెంబర్ 5: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం ధాన్యం పోటెత్తింది. మిగ్‌జాం తుఫాన్ కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో రైతులు తమ దగ్గర ఉన్న ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించడంతో మార్కెట్‌లో పెద్దఎత్తున ధాన్యరాశులు పోశారు. పెద్దమొత్తంలో 32వేల బస్తాలు అమ్మకానికి ధాన్యం రావడంతో టెండర్లు వేయడానికి వ్యాపారులకు చాలా సమయం పట్టింది. దీంతో టెండర్ ఆలస్యమైంది. అదేవిధంగా ధాన్యం ఎంత ఎక్కువగా వచ్చినా ధరలు అదే స్థాయిలో అత్యధికంగా పలికాయి. గత శనివారం కంటే అత్యధిక ధరలు నమోదయ్యాయి. మార్కెట్‌లో ధాన్యం ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యానికి క్వింటాకు రూ.3,251 ధర పలికింది. ఇప్పటివరకు ఎన్నడూ పలకని ధరలు ధాన్యానికి వస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. క్వింటా రూ.2వేలు వస్తే అది పెట్టుబడి ఖర్చులకే పోయేది కానీ ప్రస్తుతం ధర రూ.3వేలు దాటడంతో రైతులు చాలా సంతోషంగా ఉన్నారు. మంచి ధరలు వస్తుండటంతో యాసంగిలో వరిసాగు పెరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు ధాన్యం, మొక్కజొన్న, వేరుశనగ అమ్మకానికి వచ్చాయి. మార్కెట్‌కు 18,697 క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.3,251ధర రాగా కనిష్ఠంగా రూ.1,821, మధ్యస్తంగా రూ.3,156ధర పలికింది. అదేవిధంగా మార్కెట్‌కు 284క్వింటాళ్ల మొక్కజొన్న అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,347 ధర రాగా కనిష్ఠంగా రూ.2,100, మధ్యస్తంగా రూ.2,327ధర పలికింది. అదేవిధంగా మార్కెట్‌కు 522క్వింటాళ్ల హంసధాన్యం అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,325ధర పలికింది. అదేవిధంగా మార్కెట్‌కు 6క్వింటాళ్ల వేరుశనగ అమ్మ కానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.5,689ధర పలికింది.

## వైభవంగా కురుమూర్తి జాతర

- భక్తుల పూజలందుకుంటున్న స్వామి
- హుండీ ఆదాయం రూ. 27,47,855



కాంచన గుహలో కొలువుదీరిన స్వామి వారు

దేవరకద్ర రూరల్(చిన్నచింతకుంట), డిసెంబర్ 5 : ఉమ్మడి పాలమూరు జిల్లాలోని చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని సప్త గిరులోని కాంచన గుహలో కొలువుతీరిన కురుమూర్తి స్వామి జాతర వేడుకలు కొనసాగుతున్నాయి. ఆలయ అర్చకులు మంగళవారం స్వామివారికి నిత్యపూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, కొత్త కుండల్లో పచ్చిపులుసు అన్నం, పాయసం తయారు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర లో ఉన్న మిఠాయి దుకాణాల్లో మిఠాయిలు, చిన్న పిల్లల ఆటవస్తువులు కొనుగోలు చేయండంతో ప్రాంగణమంతా సందడి వాతావరణం నెలకొన్నది.

### హుండీ లెక్కింపు

బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామివారి హుండీలో భక్తులు వెండి కానుకలు, డబ్బులను వేసి మొక్కులు చెల్లించుకుంటారు. అందులో భాగంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి మదనేశ్వర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, పాలక మండలి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సమక్షంలో హుండీ లెక్కించారు. బ్రహ్మోత్సవాలు ప్రా రంభమైనప్పటీ నుంచి గతనెల 22వ తేదీ వరకు వచ్చిన మొదటి హుండీ ఆదాయం రూ.20,69,089 రాగా, అప్పటి నుంచి మంగళవారం వరకు రూ.27,47,855లు వచ్చినట్లు ఈవో తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది, అర్చకుల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

## శ్రీశైల శనగల బసవన్నకు ప్రత్యేక పూజలు

శ్రీశైలం, డిసెంబర్ 5 : శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల దేవస్థానంలో లోక క్షేమాన్ని కాంక్షిస్తూ పరివార దేవుళ్లకు వార పూజలు జరిపించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కొలువైన కుమారస్వామికి మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామికి ప్రదోశకాలంలో అభిషేకార్చనలు నిర్వహించారు. అనంతరం సంధ్యా సమయంలో నంది మండపం వద్ద కొలువైన శనగలబసవన్నకు ప్రత్యేక క్రతువులు నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలతో బాసిల్లాలని పండితులు మహా సంకల్పాన్ని పఠించి పంచామృతాలు ఫలోదకాలతోపాటు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం చేశారు. అనంతరం నందీశ్వరుడిపై స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అధిష్టించి ప్రత్యేక పూజలు జరిపి నూతన వస్త్రం, నానబెట్టిన శనగలు నైవేద్యంగా సమర్పించారు.

## సర్పంచ్ ఇంటిపై కాంగ్రెస్ నాయకుల దాడి

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 5 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని జొన్నలబొగుడ సర్పంచ్ ఇందిరారవినాయక్ ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారు. ఈ ఘటనలో సర్పంచ్, ఆమె అత్తకు గాయాలయ్యాయి. ప్రజాస్వామ్యంలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలే కానీ దాడులు చేయడం ఏంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ భర్త రవినాయక్ మాట్లాడుతూ ఐదేండ్లుగా గ్రామంలో ఇలాంటి గూండా రాజకీయాలు చూడలేదన్నారు. దాడులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఈ ఘటనపై ఇరువర్గాల నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.